www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 23 జూన్ 2025



మామిడి రైతులను ఆదుకుంటాం

రూ.200 కోట్లతో మద్దతు ధర ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధం :ఎమ్మెల్యే నాని



మామిడి రైతులకు భరోసా ఇస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి - రామచంద్రపురం (పాకాల): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం రూ. 200 కోట్లుతో మామిడి పంటకు మద్దతు ధరకు చెల్లించేందుకు సిద్ధంగా ఉందని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని అన్నారు. ఆదివారం దామలచెరువులోని మ్యాంగో మార్కెట్‌ను తనిఖీ చేసి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విషయం అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామని ప్రభుత్వం మామిడి రైతుల ఆదుకునేందుకు సిద్ధంగా తెలిపారు. గుజ్జు పరిశ్రమల యజమానులు, వ్యాపారస్తులు, ట్రేడర్స్ రైతులను ఆదుకోవాలని కోరారు. తోతాపురి మామిడికాయలను టన్ను 8వేల రూపాయలకు వ్యాపారస్తులు కొనుగోలు చేయాలన్నారు. మిగిలిన నాలుగు రూపాయలను ప్రభుత్వం రైతుల ఖాతాకు జమ చేస్తుందన్నారు. సిండికేటై రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, కూటమి పార్టీల నాయకులు, మామిడి రైతులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

దళితుడినని కుర్చీ తీసేశారు

విధులకు హాజరై కుర్చీ లేక కింద కూర్చుని నిరసన తెలుపుతున్న రవివర్మ

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: దళితుడినని తన గదిలో కుర్చీని తీసేశారని తిరుపతి ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని డెయిరీ టెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.రవివర్మ ఆరోపించారు. శనివారం విధులకు హాజరైన ఆయన నేలపై కూర్చుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. గురువారం సెలవులో ఉన్నానని, శుక్రవారం కాలేజీకి హాజరై.. తన గదిలోకి వెళ్లగా కుర్చీ కనిపించలేదని, టేబుల్ మాత్రమే ఉందని రవివర్మ పేర్కొన్నారు. దీనిపై సిబ్బందిని ఆరా తీయగా.. తన రూమ్‌లో ఉన్న పరికరంలో పాలను పరీక్షించేందుకు వచ్చిన అసోసియేట్ డీన్ రవీంద్రారెడ్డి కుర్చీని తొలగించినట్టు తెలిసిందన్నారు. దీనిపై విభాగాధిపతి విజయగీతను అడగగా ఆమె తెలియని చెప్పారని, దీంతో డెయిరీ టెక్నాలజీ డీన్ నాగేశ్వరరావుకి ఫోన్లో వివరించానని తెలిపారు. సమాచారం తెలుసుకున్న వీసీ రమణ శనివారం ఉదయం డెయిరీ టెక్నాలజీ విభాగానికి వచ్చి రవివర్మతో మాట్లాడారు. డీన్‌తో ఫోన్‌లో మాట్లాడి, కుర్చీ ఏర్పాటు చేయాలని సూచించానని, మరోసారి ఇలా జరగకుండా చూస్తామని సర్దిచెప్పారు. ఈ క్రమంలోనే డీన్, అసోసియేట్ డీన్, విభాగాధిపతిలకు ఫోన్ చేశారు. దీంతో డీన్, హెడ్‌లు విభాగానికి చేరుకోగా.. అసోసియేట్ డీన్ మాత్రం గంట తర్వాత వచ్చారు. ఏడీ వచ్చిన తర్వాత అందరితో మాట్లాడి వివాదాన్ని సద్దుమణిగేలా చూశారు. దీనిపై డీన్ నాగేశ్వరరావును వివరణ కోరగా.. డీబీఎం విభాగానికి అవసరమని రెండు కుర్చీలు కొనుగోలు చేశామని, దానిలో ఒకటి డెయిరీ టెక్నాలజీ విభాగంలో ఉండడం గమనించి మార్చినట్టు తనకు ఏడీ చెప్పారన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, వర్సిటీలో చాలా కాలంగా వర్గపోరు నడుస్తుండడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్న ప్రచారం జరుగుతోంది.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌ని అవమానించడం దారుణం

:సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ కళాశాలలో డైరీ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రవి వర్మ పై కుల వివక్షకు పాల్పడ్డ కళాశాల ప్రిన్సిపాల్‌ను ఆ పదవి నుండి తొలగించాలని, అతని పై ఎస్సీ ఎస్టీ చట్టం ప్రకారం కేసు పెట్టి అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజ్యాంగ విలువలకు నిలయాలుగా విలసిల్లాల్సిన విశ్వ విద్యాలయాలు కుల వివక్షకు కేంద్రాలుగా మారడం తీవ్రమైన విషయంగా పరిగణించాలన్నారు. కళాశాలలో ఎటువంటి సమస్యలు వచ్చిన పరిష్కరించాల్సిన ప్రిన్సిపాల్, తన సహచర అసిస్టెంట్ ప్రొఫెసర్ దళిత కులానికి చెందిన వాడని, అతను సెలవులో ఉన్న సమయంలో కక్షగట్టి అతని రూములోని టేబుళ్ళ, కుర్చీలు, వస్తువులను తొలగించి అతనిని అవమానించారన్నారు. ఇది చూసి విస్మయం చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ నేల మీద కూర్చోవాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోయారు. పై అధికారులు స్పందించి ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కళాశాలలో ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం కోరుతున్నదని వివరించారు. ఈ వివక్ష ప్రజాసంఘాలు ప్రజాస్వామిక వాదులు దళిత సంఘాలు సంయుక్తంగా పోరాటం చేస్తాయన్నారు. గతంలో ఎస్వి యూనివర్సిటీలో కూడా ఇటువంటి ఘటనలే జరిగినప్పుడు వ్యతిరేకించామని గుర్తు చేశారు.

ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకోవాలి

: కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అసిస్టెంట్ ప్రొఫెసర్ రవివర్మకు కూర్చోవడానికి కుర్చీ కూడా లేకుండా తొలగించి అవమానపరిచిన వెటర్నరీ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆర్ వెంకటేష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

చెరువు ఆక్రమణ తొలగింపు

రేణిగుంట మండలం ఎర్రంరెడ్డిపాలెం చెరువు ఆక్రమణలు తొలగిస్తున్న ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి హేమలత

ప్రజాశక్తి - రేణిగుంట: తిరుపతి జిల్లా, రేణిగుంట మండలం, తూకివాకం పంచాయతీకి చెందిన ఎర్రమరెడ్డి పాలెం గ్రామ లెక్క దాఖలాలో 141 సర్వే నెంబర్‌లో సుమారు 50 ఎకరాలు చెరువు మునక ప్రాతం ఆక్రమణకు గురవుతోందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. హేమలత వెల్లడించారు. చెరువు మునక 10 ఎకరాల 58 సెంట్లు కాగా, ఈ మునక ప్రాంతంలో లక్ష్మీనగర్ కాలనీ వాసులు కొంతమంది స్థలమాక్రమించి గుడి కట్టారు. గుడి పేరు చెప్పి కళ్యాణ మండపం కట్టడానికి లక్ష్మీనగర్ కాలనీ చెందిన టీడీపీ ఇన్చార్జి రమేష్, సి.ఆర్.ఎస్‌లో పనిచేసే అంకయ్య గత ఆరు నెలలుగా క్రమంగా చెరువును పూడ్చుకుంటూ, కొద్ది కొద్దిగా ఆక్రమించుకుంటూ సుమారు అర్ధ ఎకరా చెరువు మునక స్థలాన్ని ఆక్రమించేశారు. మట్టి తోలేటప్పుడు ఎర్రమరెడ్డి పాలెం గ్రామ రైతులు అడ్డుకున్నా కూడా వాళ్లు లెక్క చేయలేదు. రాత్రుల్లోనే చెరువు పూడ్చేశారు. చెరువు ఆక్రమణలు, కబ్జాలు ఎక్కడ జరిగిన కూడా రైతు సంఘం చూస్తూ ఊరుకోదని హేమలత హెచ్చరించారు. రేణిగుంట మండలంలో ఉండే చెరువులను, కాలువలను, అనాధీనం భూములను సర్వే చేసి, ఆక్రమణదారులపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తనపున డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులకు అండగా నిలబడి ఆక్రమణలు తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రమరెడ్డిపాలెం గ్రామ రైతుసంఘం నాయకులు జి.చంద్ర, డక్కా రమణ, పాలమాకుల సుధాకర్, ఎన్.రమణయ్య, పులిగోరు వెంకటస్వామి, ఎన్.రాధాకృష్ణ, పి.సుబ్రహ్మణ్యం, ఏ.కృష్ణ, కే.మోహన తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలి

తిరుపతి నగరంలోని వివిధ కాలనీల్లో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్:

తిరుపతి అభివృద్ధికి టీటీడీ ప్రత్యేక వందకోట్లు నిధులు కేటాయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీ.రాంభూపాల్ డిమాండ్ చేశారు. తిరుపతి నగరంలో పారిశుధ్య సమస్య చాలా తీవ్రంగా ఉందని, ఎక్కడ చూసినా డ్రైనేజీ నీళ్లు రోడ్లపై ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని ఆదివారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో యశోద నగర్, ఏఎస్ ఆర్ కాలనీ, శివ జ్యోతి కళ్యాణ మండపం ప్రాంతాల్లో సిపిఎం బృందం పర్యటించారు. ఈ పర్యటనలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ ఇతర నేతలు పర్యటించి అనేక సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ప్రతినిత్యం తిరుపతికి లక్షలాదిమంది యాత్రికులు వచ్చి వెళుతుంటారని, తిరుమలకు వచ్చే భక్తులు మొదట తిరుపతికి వచ్చిన తరువాతే తిరుమలకు వెళతారని వచ్చినటువంటి భక్తులు ఇక్కడ డ్రైనేజీ నీళ్ల దుర్గంధంలో అడుగులు పెట్టి మళ్లీ శ్రీవారి దర్శనానికి వెళుతున్నారన్నారు.

తిరుపతిలోని 50 డివిజన్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని ఈ సమస్య పట్ల దృష్టి పెట్టి పరిష్కరించాలని, 30 ఏళ్లకు మునుపు వేసిన డ్రైనేజీ పైపులైన్ల వల్ల, ఇప్పుడు జనాభా పెరిగిపోవడంతో అప్పుడు వేసిన పైపులైన్లు సరిపోవడం లేదని మొత్తం జనాభా దృష్టిలో పెట్టుకొని కొత్త డ్రైనేజీ సిస్టం తీసుకురావాలన్నారు. ఏ ఎస్ ఆర్ కాలనీలో గత నాలుగు నెలల క్రితం తెలుగు గంగ నీళ్లలో డ్రైనేజీ నీళ్లు కలుషితమై ప్రజలు అనారోగ్యాల పాలయ్యారన్నారు. రోడ్డును తవ్వి ఆ సమస్య పరిష్కరిస్తామని చెప్పి నాలుగు నెలలు పూర్తవుతున్నప్పటికీ, తవ్విన రోడ్డును పుడ్చలేదని, కలుషితమైన డ్రైనేజీ సమస్యను, తెలుగు గంగ సమస్యను పరిష్కరించలేదని విమర్శించారు. ఈ సమస్యలు పరిష్కరించకుండా ఇంతకంటే ముఖ్యమైన పనులు కార్పొరేట్ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు.

ఈ సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ బాధ్యత తీసుకుని వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో స్థానిక ప్రజలను తీసుకుని వచ్చి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.సుబ్రహ్మణ్యం కే.వేణుగోపాల్,మాధవ్, బుజ్జి, శ్రీను, సుందరం, ముకేష్, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో చిరుత మృతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఇటీవల కర్నూలు జిల్లా ఆదోని సమీపంలో గల కొసిగి ప్రాంతంలో ఆరు నుండి 7 సంవత్స రాల వయసున్న మగ చిరుత పులిని రక్షించి ఈనెల 16న ఎస్వీ జంతుప్రదర్శన శాలకు తీసుకొచ్చామని, అయితే చిరుత వేటాడి తిన్న ఆహారం అన్నవాహికలో అడ్డుపడడంతో చికిత్స పొందుతూ మరణించినట్లు ఎస్వీ జంతు ప్రదర్శనశాల క్యూరేటర్ సెల్వం తెలిపారు. కర్నూలు నుండి తీసుకు వచ్చిన చిరుతను రక్షించడానికి ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ రాజేష్ నేతృత్వంలో హెల్త్ కమిటీ రేడియోగ్రఫీ, అల్ట్రా సోనోగ్రఫీ, శారీరక రసాయనాల పరీక్షలు నిర్వహించి వైద్యుల పర్యవేక్షణలో ఇన్నాళ్లు ఉంచామన్నారు. అయితే 21న సాయంత్రం నుండి చిరుత ఆరోగ్యం మరింత క్షీణించడంతో మరణించిందని, 22న ఎస్వీ వెటర్నరీ విశ్వవిద్యాలయం పాథాలజీ విభాగం ప్రొఫెసర్ ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించి ఖననం చేసినట్లు తెలిపారు.

అరుదైన కీటకం వడ్రంగి తేనెటీగ

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, మంచినీళ్ల గుంట సమీపంలోని శివాలయంలో అరుదైన కీటకం వడ్రంగి తేనెటీగను కనుగొన్నట్లు ఎన్ఎస్ఎస్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ తెలిపారు. వడ్రంగి తేనెటీగలు జీవవైవిధ్య పరంగా పుష్పాల పరాగసంపర్కంలో అద్వితీయమైన పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఇవి సాధారణంగా ఉత్తర అమెరికాలో ఎక్కువగా ఉంటాయన్నారు. కొన్ని జాతులు మాత్రం పశ్చిమ కనుమలలో కనిపిస్తాయని తెలిపారు. ఇవి గూడు కట్టడానికి చెక్కలో రంధ్రాలు చేసే వాటి విలక్షణమైన అలవాటుతో ప్రసిద్ధి చెందాయని తెలిపారు.

తిరుమలలో తగ్గని రద్దీ

- శిలాతోరణం వరకు క్యూలో పడిగాపులు
- పాఠశాల సెలవులు ముగిసినా తరలి వస్తున్న భక్తులు
- సర్వ దర్శనానికి 24 గంటల సమయం

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో వేసవి సెలవులు ముగిసినప్పటికీ.. పాఠశాలలు ప్రారంభమవుతున్నా, తమ పిల్లలతో కలిసి శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు వేల సంఖ్యలో తిరుమలకు చేరుకుంటున్నారు. దీంతో గత నెల రోజులుగా తిరుమల కొండపై భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. ఆదివారం భక్తుల రద్దీ భారీగా పెరిగింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్మెంట్లు నిండిపోయి, శిలాతోరణం వరకు క్యూ లైన్‌లో భక్తులు వేచి ఉన్నారు. స్వామి వారి సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. శనివారం రోజు శ్రీవారిని రికార్డు స్థాయిలో 90,087 మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు ప్రకటించారు. వారిలో 41,891 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకోగా, హుండీ కానుకల ద్వారా 4.3 కోట్ల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

పుట్టినరోజునాడే మృత్యువాత

- రోడ్డు ప్రమాదంలో భార్యతోపాటు జవాన్ మృతి
- తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలైన ఇద్దరు పిల్లలు

డివైడర్‌ను ఢీకొని దగ్ధమౌతున్న కారు

మృతి చెందిన సిద్దయ్య

మృతి చెందిన సిద్దయ్య భార్య జ్యోతి

చికిత్స పొందుతున్న సిద్దయ్య కుమార్తె

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : పుట్టినరోజు నాడు శ్రీవారిని దర్శించుకుని, భార్య పిల్లలతో కలిసి ఆనందంగా ఇంటికి వెళ్తున్న ఓ జవాన్ జీవితం అర్ధాంతరంగా ఆగిపోయింది. రోడ్డు ప్రమాదంలో భార్యతో పాటు తాను అసువులు బాసిన విషాదకర ఘటన ఆదివారం చంద్రగిరి నియోజకవర్గంలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు గుడిపాల మండలం కుప్పిగానే పల్లి రామాపురానికి చెందిన సిద్దయ్య (40) ఆర్మీ జవానుగా విధులు నిర్వహించారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ శివ రెడ్డి భాస్కర్ రెడ్డికి గన్ మాన్‌గా కొంత కాలం పనిచేశాడు. ఆదివారం అతని పుట్టిన రోజు కావడంతో భార్య జ్యోతి (36), ఇద్దరు పిల్లలతో కలిసి శనివారమే తిరుమలకు చేరుకున్నాడు. ఆదివారం ఉదయం శ్రీవారి దర్శనం అనంతరం కారులో సొంతూరు గుడిపాలకు బయలుదేరాడు. చంద్రగిరి మండలం తూర్పుపల్లి వద్ద వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి పక్కనున్న డివైడర్‌ను ఢీకొనింది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జు నుజ్జు అవడంతో మంటలు వ్యాపించాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరుకొని మంటల్లో చిక్కుకున్న నలుగురిని అతి కష్టం మీద వెలికి తీశారు. అప్పటికే జవాన్ సిద్దయ్య మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన భార్య జ్యోతి, కుమారుడు, కుమార్తెను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలతో పరిస్థితి విషమించిన జ్యోతి మార్గమధ్యలోనే మృతి చెందింది. చిన్నారులు ఇద్దరినీ రుయాకి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గురైన కారు పూర్తిగా దగ్ధమైంది. జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదం జరగడంతో వాహనాలు రోడ్డుకి ఇరువైపు పూర్తిగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, ప్రమాద తీవ్రతను పరిశీలించారు. మృతుడి వద్ద దొరికిన ఆధార్ కార్డు ఆధారంగా అతను మాజీ జవాన్ సిద్దయ్య అని, మాజీ ఎమ్మెల్యేకు గన్ మేనగా విధులు నిర్వహించాలని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి భద్రతపై నిరంతర అవగాహన

- నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలు వేస్తాం
- పాఠశాల, కళాశాల, ప్రైవేట్ బస్సులపై నిరంతర నిఘా
- ప్రజాశక్తితో ఆర్టీవో కొర్రపాటి మురళీమోహన్

ముఖా ముఖి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జిల్లా వ్యాప్తంగా రహదారి భద్రతపై డిస్ట్రిక్ట్ రోడ్డు సేఫ్టీ కమిటీ (డిఆర్ ఎస్ సి) ద్వారా బ్లాక్ స్పాట్లను గుర్తించి రోడ్లు భవనాల శాఖ, జాతీయ రహదారుల శాఖ సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారించడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, అలానే రాష్ట్ర, జాతీయ రహదారులపై నిబంధనలు అతిక్రమించే వాహనదారులకు భారీ నిర్మాణాలను విధిస్తున్నట్లు జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ స్పష్టం చేశారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో వినియోగదారులకు అందుతున్న సేవలు, నూతనంగా అందుబాటులోకి వచ్చిన సేవల వినియోగంపై ప్రజాశక్తి జిల్లా రవాణా శాఖ అధికారి మురళీమోహన్ తో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించింది.

ప్రజాశక్తి: జిల్లా వ్యాప్తంగా పాఠశాల, కళాశాలలకు చెందిన ఎన్ని బస్సులు ఉన్నాయి, వాటిలో వాహన సామర్థ్య ధ్రువీకరణ పత్రాలు పొందినవి ఎన్ని ఉన్నాయి?

ఆర్టీవో: తిరుపతి జిల్లా వ్యాప్తంగా దాదాపు 1700 బస్సులు పాఠశాల, కళాశాలలకు చెందినవి ఉన్నాయి. వీటిలో ఇప్పటివరకు 1582 బస్సులు ఎఫ్ సీ పరీక్ష పూర్తి చేసుకుని ధ్రువీకరణ పత్రాలను అందుకున్నాయి. ఇంకా 96 బస్సులు ఎఫ్ సీలు పొందాల్సి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల ప్రయాణానికి వినియోగించే బస్సుల్లో నిబంధనల ప్రకారం మెడికల్ కిట్, అత్యవసర ద్వారము, అగ్నిమాపక పరికరాలు తప్పనిసరి ఉండేలా ఆయా పాఠశాలల యాజమాన్యాలకు సూచిస్తున్నాం. ఇంకను ఎఫ్ సీలు చేసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై తిరుగుతున్న బస్సులను స్పెషల్ డ్రైవ్ ద్వారా గుర్తించి ఇటీవల అపరాధ రుసుము కూడా వేయడం జరిగింది. స్కూల్ కమిటీలు, పేరెంట్స్ కమిటీలు యాజమాన్యాలు బాధ్యతగా నడుచుకుంటూ పిల్లల భద్రత పట్ల సరైన నిర్ణయాలు సకాలంలో తీసుకోవాలని సూచిస్తున్నాం.

ప్రజాశక్తి: వాహన్ యాప్ ద్వారా వినియోగదారులకు సకాలంలో సేవలు అందుతున్నాయా?

ఆర్టీవో: వాహన్ యాప్ ద్వారా రవాణా శాఖ నుండి అందించే సేవలను అందిస్తున్నాం. అప్పుడప్పుడు సర్వర్ సమస్య వలన కొద్దిపాటి ఆలస్యం అనేది జరుగుతుంది. కొద్దిపాటి ఇబ్బందులు ఉన్న వినియోగదారులకు సకాలంలో సేవలను అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ప్రజాశక్తి: ప్రైవేటు బస్సులపై రవాణా శాఖ గడిచిన కాలంలో ఏ విధమైన పర్యవేక్షణ, నిబంధనలు అతిక్రమించి ఉంటే జరిమానా వివరాలు తెలపండి?

ఆర్టీవో: కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై నేను చార్జ్ తీసుకున్న తర్వాత తిరుపతి జిల్లా పరిధిలో ముమ్మర తనిఖీలను నిరంతరంగా నిర్వహిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు నడుచుకున్న జరిమానాకు గురికావాల్సిందే. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 653 బస్సులపై తిరుపతి జిల్లా పరిధిలో కేసులు నమోదు చేశాం. ఇందుకుగాను రూ.88,71,008/- రూపాయలను జరిమానాల రూపంలో వసూళ్లు చేసాం. 2025-26 కు సంబంధించి నేటి వరకు కాంట్రాక్టర్ క్యారేజ్ బస్సులపై 224 బస్సులపై కేసులు నమోదు చేసాం. నిబంధనలు అతిక్రమించోద్దని అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూనే ఉన్నాం.

ప్రజాశక్తి: బార్డర్ చెక్ పోస్టులుపై రవాణా శాఖ ఏ విధంగా నిఘా ఉంచుతోంది?

ఆర్టీవో: అంతర్ రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రాలను ఎన్నికల సమయంలో తీసివేశారు. ఈ బార్డర్ చెక్ పోస్టులు లేకపోవడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి సరిహద్దు రాష్ట్రాల నుండి తిరుమల కావచ్చు, ఇతర ప్రాంతాలకు వచ్చే వాహనదారులు స్టేట్ పర్మిట్ టాక్స్ ను కట్టకుండా వాహన్ యాప్ ద్వారా చెల్లించవచ్చు అని వస్తున్నారు. ఈ క్రమంలో కొద్దిపాటి సాంకేతిక కారణాలతో పర్మిట్ చెల్లించలేక జరిమానాలకు గురి అవుతున్నారు.

ప్రజాశక్తి: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పాఠశాల, కళాశాలలకు చెందిన బస్సులను నడిపినట్లుగా తనిఖీలలో తేలింది. దీనిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారు?

ఆర్టీవో: ఇటీవల పాఠశాలలు పునః ప్రారంభం అయిన సందర్భంగా పాఠశాల, కళాశాలకు చెందిన బస్సులను ప్రత్యేక డ్రైవ్ ద్వారా తనిఖీలు చేశాం. అందులో కొంతమంది డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పిల్లలను బస్సులలో తీసుకురావడం గమనించాం. పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు తప్పనిసరిగా వారి వాహనాలకు సంబంధించి నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. పిల్లల ప్రయాణ భద్రతపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే చెప్పాము. 15 సంవత్సరాలు దాటిన ఏ బస్సులను ఎఫ్ సీలు చేసుకోవడానికి వీల్లేదు.

మా పాఠశాల మాకే కావాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మండలంలోని నేసనూరు పంచాయతీ, వడ్డిండ్లు పాఠశాల మాకే కావాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పిల్లలు, తల్లిదండ్రులు ఆదివారం పాఠశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ వడ్డిండ్లు నుంచి గోపాలకృష్ణపురానికి మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లడానికి పిల్లల భయపడుతున్నారని తెలిపారు. ప్రస్తుతమున్న స్కూలును అక్కడే ఉండాలని డిమాండ్ చేశారు. ఆ స్కూల్లో సుమారు 30 మంది పిల్లలు చదువుకుంటున్నారన్నారు. పుత్తూరు రింగ్ రోడ్డు దాటుకుని ఇంకో పాఠశాలకు వెళ్ళాల్సి వస్తుందని ఏమైనా ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులు అని ప్రశ్నించారు. దీనికోసం ఎంత పోరాటమైనా కొనసాగిస్తామన్నారు.

జెవివి ఆధ్వర్యంలో శిక్షణ

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ పై పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జన విజ్ఞాన వేదిక తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాల కార్య కర్తల శిక్షణా తరగతులు తిరుపతి లోని పెద్ద కాపు లేఅవుట్ కార్యాలయంలో ఆదివారం జరిగాయని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి సుంకర రెడ్డెప్ప తెలిపారు. రాష్ట్ర జెవివి ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ సమాజంలోని మూఢనమ్మకాలను పోగొట్టుటకు కళాజాతాలు, మ్యాజిక్ షోలు, చెకుముకి పోటీపరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రచయిత, విద్యావేత్త విఠపు బాలసుబ్రహ్మణ్యం చరిత్ర గమనంలో సైన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశముపై శిక్షణ ఇచ్చారు. రచయిత, డాక్టర్ గేయానంద్ జన విజ్ఞాన వేదిక ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో విఠపు బాలసుబ్రమణ్యం రచించిన 'ప్రజా సైన్స్ ఉద్యమం', గేయానంద్ రచించిన 'చరిత్ర గమనంలో సైన్స్' పుస్తకాలను టెంకాయల దామోదరం, రాష్ట్ర నాయకులు కుర్రా రామారావు, సురేష్, నాగేశ్వరరావు, యుగంధర్ తదితరులు ఆవిష్కరించారు.

ఘనంగా తిరుపతి ఎంపీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బిఎన్ కండ్రిగలో తిరుపతి ఎంపీ గురుమూర్తి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో బుచ్చినాయుడు కండ్రిగ వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు మణి నాయుడు, సోషల్ మీడియా కో కన్వీనర్ వేలూరు రాకేష్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఉగ్గుముడి గురునాథం, గ్రివియన్స్ కార్యదర్శి సాయి నాయుడు, జిల్లా క్రియాశీలక కార్యదర్శి జొన్నల గోపాల్ రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు బుర్ర మాధవి రెడ్డి, దేవదాసు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామారావుని సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావుని పారిశుధ్య విభాగం నుండి పక్కన పెట్టాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో 4వ, రోజు మున్సిపల్ కార్మికులు మోకాళ్ళ మీద నిలబడి నిరసన దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డీపల్లి చెంగయ్య మాట్లాడుతూ శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావుని బదిలీ చేయాలని, పారిశుధ్య విభాగం నుండి పక్కన పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు ఇంజనీరింగ్ కార్మికులు, సిఐటియు వెంకటగిరి మండల అధ్యక్షులు మంజుల, యూనియన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ పెంచలయ్య, సుబ్బయ్య, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, రమణయ్య, శేఖర్ తదితరులు పాలొన్నారు.

బయో లైన్ ల్యాబ్ ప్రారంభం

ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, హాస్పిటల్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన బయో లైన్ లేబరోటరీని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ పేద ప్రజలకు తక్కువ ధరలకే పరీక్షలు చేయాలని నిర్వాహకులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిమి శ్రీనివాసులు, సోమిశెట్టి చెంచురామయ్య, రహీం, శ్రీనివాసుల రెడ్డి, పెంచలయ్య, రవీందర్ రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు డి.ఎస్.ఆర్ కమ్యూనిటీ హాల్‌లో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గున్నం సేవా ట్రస్ట్ అధినేత గున్నంరెడ్డి మధుసూదన్ రెడ్డి ఆర్థిక సహకారంతో 25 మందికి నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజేంద్ర రెడ్డి, శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, హరినాథ్ రెడ్డి, కృష్ణారెడ్డి, హరికృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తమిళనాడు రాష్ట్రం మదురైలో హిందూ మున్నానీ సంస్థ నిర్వహించిన మురుగన్ భక్తుల మహానాడులో పాల్గొనేందుకు ఆదివారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్‌కి ఆరణి మదన్ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. తిరుపతి నుంచి సభలో పాల్గొనేందుకు వందకుపైగా కార్యకర్తులు వచ్చినట్లు పవన్ కళ్యాణ్‌కు మదన్ తెలిపారు. సభ అనంతరం అందురూ స్వస్థలాలకు చేరుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్, మదన్‌కు సూచించారు.

తల్లికి వందనం దరఖాస్తు ఫారాలు అందజేత

దరఖాస్తు ఫారాలు అందిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తల్లికి వందనం పథకానికి అర్హత కలిగిఉండి కూడా డబ్బు తమ ఖాతాల్లో జమ కాలేదని బాధితులు స్థానిక సి.పి.యం పార్టీ కార్యాలయంలో నాయకుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన గూడూరు సి.పి.ఎం పార్టీ నాయకులు ఆదివారం గూడూరు పట్టణ శివారు ప్రాంతాలలో నివాసముంటున్న కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య కాలని, కామ్రేడ్ జక్కా వెంకయ్య శ్రామిక నగర్ ప్రాంతాలలో సర్వే నిర్వహించి, అర్హతఉన్న వారికి దరఖాస్తు పారాలు అందజేశారు. అందులో వివరాలు పూర్తిచేసి, సోమవారం గ్రీవెన్స్ డే రోజు సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఎం నాయకులు బృందం జోగి శివకుమార్, పుట్టా శంకరయ్య, బి.వి.రమణయ్య, పామంజి మణి తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఖరీఫ్ సాగు

వెంటాడుతున్న కూలీల కొరత

ప్రజాశక్తి - తొట్టంబేడు:

ఈ సంవత్సరం ఈశాన్య ఋతుపవనాలు గత సంవత్సరం కంటే ముందుగా రావడంతో అక్కడక్కడ వర్షాలు బాగానే కురిసాయి. దీనితో పంటలు పండించే రైతులకు ఈ సంవత్సరం వర్షాలు బాగా పడతాయనే భావన కలగడంతో ఖరీఫ్ సీజన్లో పంటలు పండించడానికి సన్నద్ధమయ్యారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం కొంత ముందుగానే నాట్లు నాటారు.

మండలంలో మొత్తం 7750 హెక్టార్ల సాగు భూమి ఉంది. 9300 మంది రైతులు ఉన్నారు. ఈ సంవత్సరం 2250 హెక్టార్లలో ఖరీఫ్ సీజన్లో సాగు చేయడానికి రైతులు నడుం బిగించారు. మండలంలో ఎక్కువ శాతం మంది రైతులు వరి ధాన్యం ఎం.టి.యు 1010 రకాన్ని పండించడానికి మక్కువ చూపుతున్నారు. అలాగే ఆరుతడి పంట అయిన వేరుసెనగ టీ.ఏ.జి 24 రకాన్ని పండిస్తున్నారు. రెండు హెక్టార్లలో సద్దలు పండిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. అయితే రైతులు ఏ పంటలు పండించాలన్నా రైతు కూలీలు ప్రధాన పాత్ర పోషించాల్సి ఉంటుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా కూలీల సమస్య గ్రామాల్లో ఎక్కువ అయింది. కూలీల కొరత ఎక్కువ కావడం రైతులకి శాపంగా మారింది. పంట పొలాల్లో ప్రతి పనిని యాంత్రీకరణ విధానంలో చేయడం వలన రైతులకు కొంత నష్టం వాటిల్లితే, పెరిగిన ఎరువుల ధరలు ఇంకా ఆందోళనకు గురి చేస్తున్నాయి. పెట్టుబడులు విపరీతంగా పెరగటం వలన అందిన కాడికి అప్పులు చేసి పంటలు పండించినప్పటికీ ఆ పంటను అమ్మబోయేసరికి తీరా గిట్టుబాటు ధర లేకపోవడంతో తీసుకున్న అప్పులకు వడ్డీలు కట్టలేక చివరకు దళారి చేతుల్లో మోసపోతున్న పరిస్థితులు ఇప్పటికీ కనబడుతూనే ఉన్నాయి. కూలీలు కొరత వలన ఆరుతడి పంటగా చెప్పబడే వేరుశెనగ పంట ఈ సంవత్సరం చాలావరకు మండలంలో తగ్గిపోయింది. అలాగే వేరుశనగ పంటలకు మార్కెట్ లో గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడులు కూడా రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టలేక కొంత మంది రైతులు సద్ద పంటను సాగు చేస్తున్నారు.

వరి పంటను పండిస్తున్నాను

ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్లో వరి ధాన్యం పంటను పండిస్తున్నాను. పెరిగిన ఎరువుల ధరలు, కూలీల కొరతతో యంత్రాలతో పనులు చేయించడం వలన అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మా రైతుల పరిస్థితి అమ్మబోతే అడివి కొనబోతే కొరివి అన్న చందంగా మారింది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి రైతులు పండించే ప్రతి గింజను ప్రభుత్వమే గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయాలని కోరుతున్నాము.

ఏ. రంగయ్య.. రైతు.. బోనుపల్లి గ్రామం.

రైతులకు సమస్యలు రాకుండా చూస్తాం

ఖరీఫ్ సాగు గత సంవత్సరం కంటే ఈసారి బాగానే ఉంది. ఈశాన్య రుతుపవనాలు ముందుగా రావడం వలన వర్షాలు బాగానే కురిసాయి. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్లో పంటల సాగుకు నీటి కొరత లేదన్నారు. మండలంలో పండిస్తున్న వరి, వేరుశనగ, సద్ద పంటలు పండించే రైతులకు ఎలాంటి సమస్యలు వచ్చినా వాటికి పరిష్కారగా మార్గం చూపడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

సురేంద్ర రెడ్డి, మండల వ్యవసాయ అధికారి

భవన నిర్మాణ కార్మికుల

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతిలో భవన నిర్మాణ కార్మికుల నగర మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు కార్యాలయంలో ప్రతినిధులతో సభ నిర్వహించారు. ఈ మహాసభలకు ముఖ్య అతిధులుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాల సుబ్రమణ్యం, జిల్లా ఉపాధ్యక్షులు కె. వేణుగోపాల్, నగర ప్రధాన కార్యదర్శి ఎస్.మాధవ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎన్.డి.శ్రీనివాసులు విచ్చేశారు. వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు రోజువారీ జీవనాధారంగా తమ శ్రమను వినియోగిస్తున్నప్పటికీ, వారి హక్కులు, భద్రతలను నిర్లక్ష్యం చేయడమే ప్రభుత్వాల విధానంగా మారిందని మండిపడ్డారు. కార్మికుల సంక్షేమ బోర్డు కాలపరిమితి ముగియడంతో చాలామంది కార్మికులకు ప్రభుత్వ పథకాలు దూరమవుతున్నారని తెలిపారు. గత రెండేళ్లలో తిరుపతి నగర పరిధిలోనే అధికారికంగా 37 మంది నిర్మాణ కార్మికులు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు అంతస్తులకు అనుమతులు తీసుకొని ఐదు, ఏడు అంతకు మించిన అంతస్తులతో నిర్మాణాలు చేస్తున్న అటువంటి ప్రదేశాలలో యజమానులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదని వాపోయారు. కార్మికులకు అందాల్సిన హక్కులు, భద్రత సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో నగర అధ్యక్ష, కార్యదర్శి సుందరం, శ్రీరాములు, దాసు, వెంకటయ్య, మోదీన్, లక్ష్మణస్వామి, రాఘవ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బురదమడుగులో సమీక్షా సమావేశం

ప్రజాశక్తి -దొరవారిసత్రం : మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, సూళ్లూరుపేట నియోజకవర్గం దొరవరిసత్రం మండలం ఇంచార్జ్ కంటిపల్లి నాగేశ్వర్ రావు మాదిగ ఆధ్వర్యంలో ఎం.ఆర్.పి.ఎస్, ఎం.ఎస్.పి అనుబంధ సంఘాల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎం.ఎస్.పి రాష్ట్ర సీనియర్ నాయకులు తిరుపతి జిల్లా ఇంచార్జ్ వర్ల దేవదాసు మాదిగ విచ్చేశారు. జిల్లా సీనియర్ నాయకులు వావిళ్ళ శివయ్య మాదిగ మాట్లాడుతూ గడప గడపకు మాదిగ పల్లెలో జెండా ఆవిష్కరణ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ ఇంచార్జి కుక్కమాళ్ళి రవి మాదిగ, సూళ్లూరుపేట మహిళా మండలి అధ్యక్షురాలు మాసారం చెంగమ్మ, ఎమ్మార్పీఎస్ సూళ్లూరుపేట మండల ఇంచార్జీ ఉచ్చూరు రఘు మాదిగ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్, న్యాయమూర్తి శాలినిలు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుచానూరు భారత కమ్యూనిస్టు పార్టీ 2 వ శాఖ మహాసభ జిల్లా సమితి సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాద్ రెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి మురళి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, పేదల విముక్తి కోసం అనేక పోరాటాలను సిపిఐ పార్టీ సాధించిందని, దున్నేవాడికి భూమికోసం అనేక భూపోరాటాలను చేసి, పేదరైతాంగానికి భూములు పంచిన ఘనత సిపిఐదని తెలిపారు. మహాసభల సందర్భంగా సిపిఐ 100 జండాలతో ర్యాలీలు, 100 చెట్లు నాటడం, 100 కాగడాలతో ప్రదర్శన నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి జెల్లా విశ్వనాథం, ఎన్ చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు బైరాగి పట్టెడ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన సిపిఐ నాయకులు

సిపిఐ వందేళ్ళ చరిత్ర అజరామమైనదని ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ్ రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి రుయా హాస్పిటల్‌లో మెడికల్ యూనియన్ ఆధ్వర్యంలో సిపిఐ శత వార్షికోత్సవ సందర్భంగా ఆదివారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, నగర కార్యవర్గ సభ్యులు ఎన్ డి రవి, మెడికల్ యూనియన్ నాయకులు మహేంద్ర, కిషోర్ పురుషోత్తం, సునీల్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -వెంకటగిరి టౌన్: ఏ పీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఇంజనీరింగ్ కార్మికులకు, తల్లికి వందనం వర్తింపచేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని, గత సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా కార్యక్రమం జరుగుతుందని జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల నుండి పారిశుధ్య కార్మికులు ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డీపల్లి చెంగయ్య ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి -దొరవారిసత్రం : మండల కేంద్రం, ఎంపీడీవో కార్యాలయం, సమావేశ మందిరంలో ఆదివారం కోగిలి జయరామిరెడ్డి సేవా సంస్థ కోటపోలూరు, శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి వారి సహాయ సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో150 మందికి కంటి పరీక్షలు చేయగా, 58 మందికి కంటి ఆపరేషన్ నిమిత్తం తిరుపతి శ్రీ అరవింద్ కంటి ఆసుపత్రికి పంపారు.

జగన్‌ను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పల్నాడు పర్యటనలో ఇద్దరు అమాయకుల ప్రాణాలు పోవడానికి కారణమైన వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను అరెస్టు చేయాలని టిడిపి బీసీ విభాగం నాయకులు ఆదివారం డిమాండ్ చేశారు. బెట్టింగ్ కార్యకలాపాలతో నష్టపోయి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఓ వైసీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన జగన్ తన కారు కింద సింగయ్య అనే నిరుపేదను తొక్కించి చంపారంటూ మండిపడ్డారు. తొక్కిసలాటలో మరొకరు మృతి చెందారని అన్నారు. పోలీసులు వారిస్తున్నా పట్టించుకోని జగన్ పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథాచారి, మిన్నల్ రవి, చిన్నారెడ్డి, సెల్వం, పేట బాలాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పాఠశాలను పివి పురంలోనే ఏర్పాటు చేయాలి

గ్రామస్తులతో చర్చిస్తున్న సిపిఎం పార్టీ నాయకులు వందవాసి నాగరాజు, జయ చంద్ర

ప్రజాశక్తి - రామచంద్రాపురం : మండలంలోని ప్రసన్న వెంకటేశ్వరపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 3,4,5 తరగతులను ఆదర్శ పాఠశాల పేరుతో విలీనం చేసే ఆలోచన విరమించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం పివి పురంలో సిఐటియు, ఎస్ఎఫ్ఐ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రజలతో చర్చించి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ పీవీ పురంలో 42 మంది విద్యార్థులు ఉంటే, ఈ విద్యార్థులను బలిజపల్లి మోడల్ పాఠశాలకు మార్చడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రసన్న వెంకటేశ్వరపురం గ్రామంలోనే మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు గ్రామంలో ఉన్న మా బడి మాకే కావాలి మాకు న్యాయం జరగాలి అంటూ గ్రామస్తులు నినాదాలు చేశారు. మా పిల్లలకు ప్రభుత్వ బడుల చదువులకు దూరం చేయకండి సారూ అంటూ వేడుకొన్నారు. బలిజపల్లి మోడల్ స్కూల్‌కు వెళ్లాలంటే రామిరెడ్డిపల్లి, ఎస్టీ కాలనీ, గంగమాంబ పురం, అరుంధతి వాడ, పివిపురం, గ్రామాల నుంచి విద్యార్థులు రాష్ట్ర రహదారిపై నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. రోడ్డు దాటేటప్పుడు ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందని, కావున మోడల్ పాఠశాలను పీవీ పురం లోనే ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర డిమాండ్ చేశారు. పి.వి పురంలో మోడల్ స్కూల్ ఏర్పాటుపై సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కే.సుమన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీల రాష్ట్ర కో కన్వీనర్ అశోక్ కుమార్, ఎస్ఎఫ్ఐ నగరకార్యదర్శి తేజ గ్రామంలోని తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కాలువను అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి - రామచంద్రాపురం: మండలంలోని రావిళ్ళవారిపల్లి పంచాయతీ బ్రాహ్మణ కాలవ, హరిజనవాడ గ్రామాలు వరద నీటికి ముంపు కాకుండా ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. ఆదివారం బ్రాహ్మణ కాలువ సమస్యల పరిష్కారానికి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగు నీటి కాలువ ఆక్రమణకు గురై పూర్తిగా పూడిపోవడంతో వరదనీరు నిలిచిపోయి చెరువును తలపిస్తోందనిని, రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందని గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే ఇరిగేషన్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో పాటు స్థానిక రైతులతో చర్చించి శాశ్వత పరిష్కారానికి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేకల తిరుమలరెడ్డి, మాజీ ఎంపీపీ కేశవ నాయుడు, జనార్ధన్ చౌదరి, రావిళ్ళ గిరినాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో సోమవారం సాయంత్రం కళాశాల వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ ఎంవి రమణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ వెంకటేశ్వర వేదిక్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తి విచ్చేయనున్నారని తెలిపారు.

థాంక్యూ సీఎం సార్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తల్లికి వందనం పథకంలో నిరుపేద విద్యార్థులకు వారి ఖాతాలో డబ్బులు జమ చేయడంతో ఆదివారం సీఎం చంద్రబాబు నాయుడుకి విద్యార్థులు థాంక్యూ సీఎం అంటూ పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ మాట్లాడుతూ తల్లికి వందనం పథకంలో ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి వారి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేయడం సంతోషకరమైన విషయం అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, పార్లమెంట్ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడు, రజక సాధికార కమిటీ రాష్ట్ర మెంబర్ ఎస్ శంకర్, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీకి ఏసి బస్సు బహూకరణ

ప్రజాశక్తి - తిరుమల: ఆటో మొబైల్ కంపెనీ, అశోక్ లేలాండ్ టిటిడికి ఒక 41-సీటర్ ఏసి బస్సును ఆదివారం నాడు విరాళంగా అందించింది. సుమారు రూ. 35 లక్షల విలువైన ఈ బస్సును అశోక్ లేలాండ్ యం అండ్ హెచ్‌సివి అధ్యక్షుడు సంజీవ్ కుమార్ శ్రీవారి ఆలయం ముందు టిటిడికి అందజేశారు. సాధారణంగా ప్రతి ఏడాది అశోక్ లేలాండ్ కంపెనీ వారు టిటిడికి ఒక ఆటోమొబైల్ వాహనాన్ని విరాళంగా అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, తిరుమల డిపో డిఐ వెంకటాద్రి నాయుడు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు, శెంగుంద వీధిలో ఉన్న శ్రీ సాయిరాం హాస్పిటల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రాజస్థాన్ ఔషధాలయం (ఆయుర్వేద) ప్రైవేట్ లిమిటెడ్, ముంబయి వారి సహకారంతో డాక్టర్ ఇరుగు తనూష ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించబడింది.

మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం : రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ విజయవంతంగా చేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు చంద్రగిరి నియోజకవర్గంలోని ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలియజేశారు. ఆదివారం చంద్రగిరి నియోజకవర్గంలోని ఉపాధ్యాయ సంఘల నాయకులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు జగదీష్, సురేష్‌లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 70 వేల మంది ఉపాధ్యాయులు కోరుకున్న స్థానాలకి బదిలీపై వెళ్లడం జరిగిందన్నారు. బదిలీల ప్రక్రియని పారదర్శకంగా పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జగదీష్, ప్రధానోపాధ్యాయులు సురేష్ ఉపాధ్యాయులు హరికృష్ణ, రామిరెడ్డి, నాథముని, రూపకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): శేషాచలం అటవీ పరిధి భాకరాపేట - కళ్యాణి డ్యాం అటవీ ప్రాంతంలో ఇద్దరు ఎర్ర చందనం స్మగ్లర్లను అరెస్టు చేసి 6 ఎర్ర చందనం దుంగలు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఏఆర్ఎస్ఐ కే.మహేశ్వరనాయుడు బృందం శనివారం రాత్రి స్థానిక ఎఫ్బీఓ సి.రవితో కలిసి నాగపట్ల ఫారెస్టు బీటు పరిధిలో కూంబింగ్ చేపట్టారని టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం భాకరాపేట-కళ్యాణీ డ్యాం అటవీ మార్గంలో ఒక మోటారు సైకిల్‌తో పాటు, ఇద్దరు వ్యక్తులు కనిపించగా వీరిని సమీపించడంతో చూసి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. వారిరువురిని అదుపులోకి తీసుకొని చుట్టుపక్కల పరిశీలించగా 6 ఎర్రచందనం దుంగలను గుర్తించామన్నారు. పట్టుబడిన మహిళలలో ఒకరు నెల్లూరు జిల్లా, ఒకరు తమిళనాడుకు చెందినవారుగా గుర్తించమన్నారు. ఈ ఘటనపై టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్ సిఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

పామాయిల్ ట్యాంకర్ బోల్తా

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలం, గుర్రపు తోట సమీపంలో జాతీయ రహదారిపై శనివారం అర్ధ రాత్రి కృష్ణపట్నం పోర్టు నుంచి శ్రీ కాళహస్తికి వెళుతున్న పామాయిల్ ట్యాంకర్ లారీ నడుపుతున్న డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ట్యాంకర్‌లో 20 టన్నుల పామాయిల్ ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న నాయుడుపేట ఎస్సై ఆదిలక్ష్మి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఏఎస్ఐ మునస్వామి స్వల్ప గాయాలతో బయటపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం శ్రీ కాళహస్తి ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

ప్లాస్టిక్ భూతం.. భవితకు శాపం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ పరిసర ప్రాంతాలు పారిశ్రామిక వాడలుగా అభివృద్ధి చెందడంతో మండలంలో జనభా కూడా పెరిగింది. దీంతో వ్యర్థాలు ఎక్కువైపోతున్నాయి. విధులకు నిత్యం వెళ్లే కార్మికుల తాకిడి ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో టిఫిన్ సెంటర్స్ వెలుస్తున్నాయి. టిఫిన్ సెంటర్ నిర్వాహకులు వాడి పారేస్తున్న ప్లాస్టిక్ పేపర్లు, కవర్లు రోడ్లపై అపరిశుభ్రతకు, వ్యర్థాల పెరుగుదలకు కారణమవుతున్నాయి. ఈ ప్లాస్టిక్ పేపర్ వల్ల ఆరోగ్యానికి పెను ప్రమాదం ఉందని తెలిసినా అవి అమ్మే వ్యాపారస్తులు, టిఫిన్ సెంటర్ నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాల్సిన అధికారులు ఈ షాపుల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ప్లాస్టిక్ పేపర్లపై వేడి పదార్థాలు వేసి తింటే కేన్సర్‌కు దారి తీస్తుందని వైద్యులు సూచిస్తున్నప్పటికి వీటి వినియోగం అదుపులోకి రావడం లేదు. వాటర్ ప్యాకెట్స్ బదులుగా వాటర్ బాటిల్స్ వచ్చాయి. బ్రాందీ షాపుల దగ్గర విచ్చలవిడిగా వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ గ్లాసులు కుప్పలు తెప్పలుగా పడి ఉంటున్నాయి. అంతేకాక చిరు వ్యాపారుల దగ్గర విపరీతంగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం జరుగుతోంది. ప్లాస్టిక్ కవర్ల వినియోగించుకునే వారిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించుకునే లోపే ఈ విషయం కవర్ల విక్రయదారులకు తెలిసిపోవడం గమనార్హం.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చలర్ పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఖాళీగా ఉన్న జంతుశాస్త్రం, వృక్షశాస్త్రం సబ్జెక్టుల్లో బోధించుటకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ ఉత్తీర్ణత, బోధనానుభవం ఉన్నవారికి ప్రాధాన్యత కల్పించబడునన్నారు. అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలను ఈనెల 24 తేదీ లోపు కళాశాల కార్యాలయంలో అందజేయాలని కోరారు.

జనసేన నాయకుడు రాయుడుపై వేటు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విద్రోహ చర్యలకు పాల్పడిన కారణంగా బొక్కసంపపాలెం గ్రామానికి చెందిన రాయుడు అలియాస్ శ్రీనివాసులును జనసేన పార్టీ నుంచి తొలగించినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కోటా వినుత ఆదివారం ఒక ప్రకటనలో మీడియాకు తెలిపారు. జనసేన కార్యకర్తగా, వ్యక్తిగత సహాయకుడిగా ఉన్న రాయుడు ప్రత్యర్థుల ప్రలోభాలకు లొంగి పార్టీ విద్రోహ కార్యక్రమాలకు పాల్పడినట్లు ఆమె తెలిపారు.

డాక్యుమెంటు పోయినది

పత్రాలు మరియు ఏటీఎం పోయిన ప్రకటన తమిళనాడు మాధవరం గ్రామానికి చెందిన E.శివకుమార్ S/o ఏలుమలై నాయకర్ అను నేను 10-06-2025 వ తేదీ సత్యవేడు మండలం ఆంభాకం గ్రామ మామిడి తోటలో రెండు ఒరిజినల్ ల్యాండ్ డాక్యుమెంట్స్ మరియు ఒక ఏటీఎం ను బ్యాగ్ తో పోగొట్టుకున్నాను.

ఆస్తి పత్రాల వివరాలు

డాక్యుమెంట్ దారు పేరు : ఏలుమలై నాయకర్, S/o చిన్న కన్ను

డాక్యుమెంటేషన్ నంబర్లు :

1. 222/1939 , 2. 1813/1951

సర్వే నెంబర్ : **441/2** ఈ పత్రం దొరికినట్లయితే, దయచేసి మీరు **9787929391** ఫోన్ నంబర్ ద్వారా E.శివకుమార్ అయినా నన్ను సంప్రదించండి.